క్లుప్తంగా

విద్యుత్ శాఖ ఏడీఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావు

ఉదయగిరి: ఉదయగిరి విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈగా డి.కోటేశ్వర రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో పని చేస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తానన్నారు. వినియోగదారులు ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

కుస్తీ పోటీల్లో కేజీబీవీ విద్యార్థికి కాంస్య పతకం



క్రీడల్లో ప్రతిభ చాటిన మౌనిక అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలిగిరి: రాష్ట్ర స్థాయి వెస్ట్రిలింగ్ (కుస్తీ) పోటీల్లో కలిగిరి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఎస్. మౌనిక కాంస్య పతకం సాధించింది. స్థానిక కేజీబీవీలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మౌనికను సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపల్ సుప్రియ మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్–17 కేటగిరీ, 73 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిందన్నారు.

రీసర్వే ప్రారంభం



రీసర్వే ప్రక్రియను ప్రారంభిస్తున్న దృశ్యం

సంగం: మండలం చెన్నవరప్పాడులో సోమవారం రీసర్వే ప్రక్రియ అధికారులు ప్రారంభించారు. గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని 1,350 ఎకరాలకు సంబంధించి నెల రోజుల పాటు రీసర్వే నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.


దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్య క్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గట్టిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దుగ్గయ్య, సీహెచ్ సుబ్బరత్నం, మహబూబ్ బాషా, సుబ్రహ్మణ్యం గుప్తా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం



భోజన శాలను ప్రారంభిస్తున్న టీజీ స్పెషల్ కలెక్టర్ సువర్ణమ్మ

ఆత్మకూరు: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో కొలువై ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భోజన శాలను సోమవారం తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ జి.సువర్ణమ్మ ప్రారంభించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహించడం ఆనవాయితీ. అయితే వంట తయారు చేయడంతో పాటు భోజనశాల వసతి లేకపోవడంతో విషయం తెలుసుకున్న సువర్ణమ్మ తన కుటుంబ సభ్యుల సహకారంతో తన తండ్రి నారాయణస్వామి పేరు మీద సుమారు రూ.2 లక్షలు వెచ్చించి ఆలయ ప్రాంగణంలో భోజన శాలను నిర్మించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెంచురత్నం, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

మాజీ ఎంపీటీసీ తండ్రి మృతికి సంతాపం

చేజర్ల: చేజర్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆత్మకూరు గణేష్ తండ్రి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా మృతి చెందడంతో సోమవారం ఆయన మృతదేహానికి చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ అవుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జగనన్నకు చెబితే.. పరిష్కారం

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం వేదిక బాధ్యతాయుతంగా పని చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివక్షకు తావులేని వ్యవస్థ తీసుకురావాలని విప్లవాత్మక అడుగులు వేసే క్రమంలో స్పందన కంటే మెరుగ్గా ఉండేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. పథకాలకు అర్హత ఉన్నా రాకపోతే, ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమైనా, వ్యక్తిగత సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేందుకే ఈ కార్యక్రమం ప్రారంభించారు.

- రెవెన్యూ డివిజనల్ స్థాయిలో నాలుగు నెలల్లో 2,912 అర్జీలు
- 2,563 సమస్యలకు పరిష్కారం
- 349 అర్జీల సమస్యల పరిష్కారానికి అధికారుల కసరత్తు



'జగనన్నకు చెబుదాం'లో అర్జీ స్వీకరించి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ శీనా నాయక్

కావలి: 'జగనన్నకు చెబుదాం' వేదికలో ఫిర్యాదు చేస్తే కచ్చితంగా ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే భరోసా కల్పించడంలో జిల్లా అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు వరకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. ఒక సమస్యపై మరోసారి ఫిర్యాదు రాకుండా పరిష్కారాన్ని చూపిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి గతంలో నిర్వహిస్తున్న 'ప్రజావిజ్ఞప్తులు' కార్యక్రమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే 'స్పందన'గా పేరు మార్చి ఫిర్యాదుల పరిష్కారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంకా మరింత మెరుగ్గా ఉండాలనే లక్ష్యంతో ఈ ఏడాది 9వ నుంచి 'జగనన్నకు చెబుదాం' పేరుతో ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారం చూపిస్తున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరినారాయణన్ జిల్లా స్థాయిలోనే కాకుండా.. డివిజన్, మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదులపై దృష్టి సారించారు. బాధ్యతగా, పారదర్శకంగా సమస్యకు పరిష్కారం చూపిస్తున్నారు. తాజాగా కలెక్టర్ స్వయంగా మండల స్థాయిలో జగననన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పరిష్కారంలో కావలి డివిజన్ ముందు

కావలి ఆర్డీఓ కార్యాలయంలో ప్రతి సోమవారం స్వయంగా ఆర్డీఓ వీకే శీనానాయక్ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు మరింత మెరుగ్గా పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం న్యాయంగా ఉంటే ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఉంటుందని భావించి జగనన్నకు చెబుదాం అమల్లోకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వంలో అర్హత ఉండి కూడా పథకాలకు పొందాలంటే జన్మభూమి కమిటీలు, ఏ పార్టీ అని అడిగి వాటిని ఇచ్చే దుర్గతి. పింఛన్ల నుంచి ఇళ్ల కేటాయింపుల వరకు ఉండేది. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి, ఎక్కడైనా, ఏ సమస్యకైనా ప్రయత్నం చేసినా పని జరగని పరిస్థితి ఉంటే వాటికి పరిష్కారం చూపేందుకు, వ్యక్తిగత సమస్యలకు జిల్లాలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుల పరిష్కారంలో ముందు వరుసలో ఉంది.

మండలం	అర్జీలు	పరిష్కారం	పరిశీలన	పునః పరిశీలన
అల్లూరు	101,	90	11	–
అల్లూరు టౌన్	108	94	14	–
బోగోలు	189	167	21	1
దగదర్తి	348	253	94	1
దుత్తలూరు	271	247	23	1
జలదంకి	335	301	34	–
కలిగిరి	446	405	39	2
కావలి	175	155	20	–
కావలి పట్టణం	190	174	16	–
కొడవలూరు	182	154	26	2
విడవలూరు	262	244	17	1
వింజమూరు	305	272	26	–

ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయి నుంచి నివేదిక

కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఫిర్యాదులపై క్షేత్రస్థాయి నుంచి కావలి ఆర్డీఓ శీనానాయక్ నివేదిక తెప్పించుకుని పరిష్కారాన్ని చూపిస్తున్నారు. కావలి ఆర్డీఓకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించిన నాలుగు నెలల్లో మొత్తం 2,912 అర్జీలు అందాయి. అందులో 2,563 అర్జీలకు పరిష్కారం చూపించగా, 341 అర్జీలు పరిశీలనలో ఉన్నాయి. పరిష్కారానికి చర్యలు తీసుకున్నా.. అర్జీదారుడు పూర్తిస్థాయి సంతృప్తి చెందకపోవడంతో పునః పరిశీలనలో మరో 8 అర్జీలు ఉన్నాయి.

2024 ఎన్నికలకు మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

- కావలి ఉమెన్ ఫోర్స్, జమాయతే ఇస్లామి హింద్ చర్చావేదిక డిమాండ్

కావలి: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే అమలు చేయాలని కావలి ఉమెన్ ఫోర్స్, జమాయతే ఇస్లామి హింద్ డిమాండ్ చేసింది. పట్టణంలోని తుపాన్‌నగర్‌లో ఉన్న 'జమాయితే ఇస్లామి హింద్ కార్యాలయంలో సోమవారం చర్చావేదిక జరిగింది. జమాయతే ఇస్లామి హింద్ రాష్ట్ర బాధ్యులు ఫాతిమా కౌర్, జిల్లా బాధ్యురాలు జహీదాబేగం మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ 2029లో అమలవుతుందని కేంద్రం చెబుతూనే ఈ చట్టాన్ని హడావుడిగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎందుకు ఆమోదించారన్నారని ప్రశ్నించారు. కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద మాట్లాడుతూ 1995 నుంచి పలుమార్లు పలు ప్రభుత్వ పెద్దలు ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు 'పురిటిలోనే సంధి కొట్టించారని, ముసాయిదాను కూడా చించివేసిన సందర్భాలు విచారకరమన్నారు. 2026 జనాభా లెక్కల తర్వాత 2027లో నియోజకవర్గాల పునర్విభజనతో పెరిగే ఎమ్మెల్యేలు, ఎంపీ స్థానాలను బట్టి మహిళా రిజర్వేషన్లను కేటాయించనున్నట్లు పేర్కొనడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కావలి ఉమెన్ ఫోర్స్ కార్యవర్గ సభ్యులు ఫాతిమా, నూర్జహాన్, లక్ష్మి, రమాదేవి, ఉపాధ్యక్షురాలు టి. సుజాత, జమాయతే ఇస్లామి హింద్ సభ్యులు హుమారా, సమీరా, బుష్రా , పరివ్రీన్, షకీలా పాల్గొన్నారు.

కుస్తీ పోటీల విజేతకు ఘన సన్మానం



విద్యార్థిని అర్చన, పీఈటీ వెంకట కృష్ణయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎ.అర్చన ఇటీవల రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో రజత పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో అర్చనతో పాటు పీఈటీ వెంకట కృష్ణయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం పెంచలయ్య మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొనగా అర్చన రజత పతకాన్ని గెలుచుకుని పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేసిందన్నారు. మంగళ వాయిద్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులు కుస్తీ పోటీల విజేతను, ఉపాధ్యాయులకు పుష్పాభిషేకం చేస్తూ పాఠశాల వరకు స్వాగతం పలికారు. అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో అపస్ ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వరలక్ష్మి, పెంచలయ్య, పాల్గొన్నారు.

అనారోగ్యంతో 12వ వార్డు కౌన్సిలర్ మృతి



ఆత్మకూరు మెప్మా కార్యాలయంలో యుగలక్ష్మి మృతికి మౌనం పాటిస్తున్న మెప్మా సిబ్బంది



యుగలక్ష్మి (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి (38) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. రెండున్నరేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డు నుంచి యుగలక్ష్మి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. గతేడాది నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలకు గురైన ఆమె చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు భర్త కొండా చిన్న వెంకటేశ్వర్లు, కుమారుడు మోక్షజ్ఞ ఉన్నారు.

ఎమ్మెల్యే మేకపాటి సంతాపం

కౌన్సిలర్ యుగలక్ష్మి మరణ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాసనసభ సమావేశాల్లో ఉండడంతో ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, చిన్న వయసులోనే యుగలక్ష్మి మృతి చెందడం బాధాకరమన్నారు.

కౌన్సిలర్ మృతికి సంతాపం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డితో పాటు చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ బి.నాగేశ్వర రావు, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కె వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యుగలక్ష్మి పొదుపు గ్రూపులో ఉండడంతో మెప్మా కార్యాలయంలో సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి ఆధ్వర్యంలో సిబ్బంది మౌనం వహించి సంతాపం వ్యక్తం చేశారు. టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు గంధళ్ల లక్ష్మి, ఈసీ సభ్యులు తీర్మానం ద్వారా ఆ కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కావలి: మానవ అక్రమ రవాణాపై సోమవారం స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ అక్రమ రవాణాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైతిక విలువలు, బాల్య వివాహాలు, విద్య ప్రాముఖ్యత, తల్లిదండ్రుల ముఖ్య పాత్ర, సమాజంలో ఆడ పిల్లలు చదువుతో పాటు వాళ్లను వాళ్లు రక్షించుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రేమ, పెళ్లి, ఉద్యోగం పేరుతో రకరకాలుగా ప్రలోభపెట్టి మానవ అక్రమ రవాణా చేయించడం, మహిళలను వ్యభిచార గృహాలకు విక్రయిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకయ్య, మట్టా కొండయ్య, స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా, వివిధ సంస్థల ప్రతినిధులు వీఎంఎస్‌ఆర్ మాలి, రాయపాటి దిలీప్‌కుమార్, జమీర్, రఫీ అహమ్మద్, ప్రసాద్‌రావు, అజిత్‌బాబు, మహమ్మద్ అలీంబేగ్, బ్రహ్మయ్య హరినాథ్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో కొలువైన పద్మావతి లక్ష్మి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భాద్రపదం మాసం దశమి ఏకాదశి కలయిక సోమవారం రావడంతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదికపై చేర్చి కల్యాణ ఘట్టాలను శాస్త్రోక్తంగా వివరిస్తూ అర్చకులు కల్యాణ తంతును నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీఎన్ఏ సర్వేలో మొదటి స్థానం

చేజర్ల(సోమశిల): టీచర్ ట్రైనింగ్ నీడ్ అనాలసిస్ సర్వే పూర్తి చేయడంతో రాష్ట్రంలోనే అనంతసాగరం మండలం మొదటి స్థానంలో నిలిచిందని ఎంఈఓలు ఎం.బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ సర్వే మండలంలో 100 శాతం పూర్తి చేశామన్నారు. సబ్జెక్ట్‌లో నాణ్యతను పెంచేందుకు ఉపయోగ పడుతుందన్నారు. టీఎన్ఏ సర్వే పూర్తి చేయడంలో కృషి చేసిన ఎస్ఆర్పీలు అందే సురేష్ కుమార్, శ్రీలతను ప్రత్యేకంగా అభినందించారు.

స్వచ్ఛత సేవపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలని విద్యార్థులు స్వచ్ఛత సేవాపై అవగాహన కలిగి ఉండాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. స్వచ్ఛత సేవా 2.0లో భాగంగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వచ్ఛత సేవపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఉపాధ్యాయులు స్వచ్ఛత సేవపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌శర్మ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి అమృత్ కలశాలు



ఎంపీడీఓ కార్యాలయానికి మట్టి కలశాలు

ఉదయగిరి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నాదేశం–నామట్టి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అమృత్ కలశ యాత్రకు సంబంధించిన కలశాలు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నాయి. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటి నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మట్టి సేకరించారన్నారు. ఆ మట్టిని హిందూ సంప్రదాయ ప్రకారం కలశాల ద్వారా ఢిల్లీ పంపనున్నామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి



గంగమిట్టలో కరపత్రాలు అందజేస్తున్న రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మళ్లీ ఆయనే సీఎం కావడవం తథ్యమన్నారు. వింజమూరు సచివాలయం–2లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయన ప్రతి గడపకు వెళ్లి ఇంత వరకు ప్రభుత్వం ద్వారా అందిన ఆర్థిక లబ్ధికి సంబంధించిన వివరాలతో కూడి బుక్‌లెట్‌ను అందజేశారు. జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగిందా? లేదా? అని ఆరా తీశారు. అందరూ మంచి జరిగిందని బదులిచ్చారు. భవిష్యత్‌లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాలన్నారు. మీకు మంచి జరిగి ఉంటేనే ఈ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలకు అన్ని తెలుసున్నారు. టీడీపీకి భవిష్యత్ లేదన్నారు. చంద్రబాబు కుంభకోణాలు చేసి జైల్లో ఊచలు లెక్క పెడుతున్నారు. తప్పు చేస్తే ఎవరైనా శిక్ష అనుభవించి తీరాలన్నారు. బాబు నలభై ఏళ్లగా వ్యవస్థలను మేనేజ్ చేసి తప్పించుకున్నాడని, ఇప్పడు పాపం పండిందన్నారు. గంగమిట్టలో తాటిచెట్ల కాలేషా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రాజారెడ్డికి పూల వర్షం,బ్యాండు మేళాలతో అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాస రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయరెడ్డి, పార్టీ నేతలు పల్లాల కొండారెడ్డి, మద్దూరి బాబు, గువ్వల కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ అనంగి రాజేష్, ఎంపీడీఓ రాజేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, ఈఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి

- తెలుగు భారతి సేవా సమితి మంచిమాట
- ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రవీంద్రను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మానవ జీవితం ఎంతో ఉన్నతమైందని ప్రశాంత జీవనం సాగించడంతో పాటు ఉన్నంతలో తోటి వారికి సహాయ పడుతూ జీవిత పరమార్థం తెలుసుకుని సార్థకం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని మేధా పాఠశాలలో సోమవారం తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచిమాట కార్యక్రమం నిర్వహించారు. మానవ జీవితం ఒక నాటకరంగం, కాలధర్మం, జీవిత సత్యాలు అనే అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ పిల్లలను ఆ దృష్టి నుంచి మరల్చి సన్మార్గంలో నడిచేలా పెద్దలు బాధ్యత వహించాలన్నారు. మొక్కలు విరివిగా నాటి అవి పెరిగి పెద్దవి అయ్యేంత వరకు సంరక్షిస్తే ఆ చల్లని నీడ ఎన్నో జీవరాశులకు ఉపయోగపడుతుందన్నారు. అన్నార్తులకు పిడికెడంత అన్నం పెట్టి ఆకలి తీర్చాలని, మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని పాటించాలన్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కలిశెట్టి రవీంద్రను కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమవరపు సుబ్బరాయుడు, పి వెంకటరెడ్డి, కె వెంకటేశ్వర్లు, గోవింద రెడ్డి, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, వెలిశెట్టి నారాయణ రావు, డాక్టర్ పీఎస్‌బీ శ్రీనివాసరావు, కేవీ శేషారెడ్డి, అపర్ణ, మల్లికార్జున, రామయ్యస్వామి పాల్గొన్నారు.

23 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వంశీధర్‌రెడ్డి

కావలి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కావలి రెడ్‌క్రాస్‌లో సోమవారం రక్తదాన శిబిరం జరిగింది. 23 మంది రక్తదానం చేశారు. బీజేపీ రాష్ట్ర నేత ఆర్టీ విల్సన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతిరెడ్డి విష్ణుతేజరెడ్డి, పట్టణాధ్యక్షుడు బ్రహ్మనందం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పునూరు మాధవి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణనాయుడు, మంద కిరణ్, బెల్లంకొండ మల్యాద్రి, సీపీసీ సత్యం, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉదయలక్ష్మి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో..

జలదంకి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బస్టాండ్ సెంటర్లో సోమవారం కావలి రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. 22 మంది యువకులు రక్తదానం చేశారు. బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కో–కన్వీనర్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మార్లెళ్ల బ్రహ్మారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ కన్వీనర్ కదిరి రంగారావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు చల్లా హనుమారెడ్డి, ఎంపీటీసీ కుట్టుబోయిన మాధవరావు, వంటేరు రాకేష్‌రెడ్డి, కంచర్ల శరత్‌బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష



సంగం మండలం జెండాదిబ్బలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఇంటింటికి తిరిగి ఆరోగ్య పరిస్థితులపై నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆత్మకూరు మున్సిపల్ పరిధితో పాటు మండలాల్లోనూ ముమ్మరంగా సాగుతోంది. ఏఎన్‌ఎంలు, ఆశలు, వలంటీర్లు ప్రజల ఆరోగ్య పరిస్థితిని రికార్డులో నమోదు చేసుకుంటున్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటికి వచ్చి తమ ఆరోగ్య పరిస్థితిని అడిగి పరీక్షలు నిర్వహించి నమోదు చేసుకుంటుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పాల్గొంటున్నారు.

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15 నుంచి వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే బృందం ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించి ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే వలంటీరు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నోడల్ బృంద అధికారులు పర్యవేక్షించి సర్వే బృందానికి సూచనలు, సలహాలు అందిస్తున్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

అనుమసముద్రంపేట: మండలంలోని ఏఎస్ పేట, చిరమన పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సోమవారం ఏఎస్‌పేట బిట్–1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలను నిర్వహించడమే కాక జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని డాక్టర్ సరేష్‌బాబు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

పొగాకు పంటలో నియంత్రణ పాటించాలి



పొగాకు నారుమళ్లను పరిశీలిస్తున్న రీజనల్ మేనేజరు లక్ష్మణరావు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): పొగాకు సాగుచేసే రైతులు బోర్డు సూచనలకు అనుగుణంగా పంటల సాగులో స్వీయ నియంత్రణ పాటించాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు తెలిపారు. డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలోని డీసీపల్లి, నెల్లూరుపాళెం, ముస్తాపురం గ్రామాల్లో రైతులు పెంచుతున్న పొగాకు నారుమళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల అవగాహన సదస్సులో ఆర్‌ఎం మాట్లాడుతూ ఒక్కో పొగాకు బ్యారెన్‌కు 2.9 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణంలో మాత్రమే పొగాకు పంట సాగు చేయాలన్నారు. ఒక్కో బ్యారెన్ రైతు 3,650 కిలోల ఉత్పత్తులను మాత్రమే విక్రయించేందుకు అనుమతించామన్నారు. కరోనా కారణంగా పొగాకు పంట సాగు అంతర్జాతీయంగా తగ్గడం వల్ల మన రాష్ట్రంలోని వేలం కేంద్రాల్లో రికార్డ్ స్థాయి ధరలు నమోదయ్యాయన్నారు. అయితే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పొగాకు పంట పుంజుకుంటుందని తద్వారా మన రైతుల ఉత్పత్తులకి ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు పొగాకు పండించే భూముల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువులను పెంచడం వల్ల నాణ్యమైన పొగాకు దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్, ఐటీసీ మేనేజరు వెంకటేశ్వరరావు, పొగాకు బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.